క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



మొగల్తూరులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బాపూజీ

మొగల్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత డ్వాక్రా మహిళలకు అందిస్తున్న పథకాలపై మహిళలకు అవగాహన కల్పించాలని జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజి కోరారు. బుధవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా మహిళల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్వాక్రా గ్రూపుల్లో చేరని మహిళలను గుర్తించి వారిని డ్వాక్రా గ్రూపుల్లో చేర్చాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్ పడవల మేరీ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పాలా దేవి, ఏపీఎం ఎం.సుభాషిణి, వైఎస్సార్ సీపీ నాయకులు రేవు రాంబాబు, పాలా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పీఎం లంక సొసైటీ అధ్యక్షుడిగా చామకూరి

నరసాపురం రూరల్: మండలంలోని పెదమైనవానిలంక పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా ప్రముఖ వ్యాపారి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చామకూరి నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈయనతోపాటు పర్సన్స్‌గా బొక్కా సత్యనారాయణ, తిరుమాని భూలక్ష్మి లను నియమిస్తూ జిల్లా కోఆపరేటివ్ అధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. శుక్రవారం నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించనుంది. ఇప్పటికే సొసైటీ కార్యదర్శిగా పోశంశెట్టి కుమార్ వ్యవహరిస్తున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాధాకృష్ణ

నరసాపురం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కోట్లాది రూపాయలు కేటాయిస్తుందని, విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, నరసాపుం జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని తూర్పుతాళ్లు పంచాయతీ కార్యాలయం సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు, విద్యా సామగ్రి కిట్లు, మధ్యాహ్న భోజనం, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కరింశెట్టి రత్నారంగారావు, గుత్తుల బాలాజీ, కోడి రఘు, కోట్ల సుధాకర్, మామిడిశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గరగాలమ్మ డ్రెయిన్ ప్రక్షాళన



సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రెయిన్ ప్రక్షాళన కొనసాగుతున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రెయిన్ ప్రక్షాళన పనులు బుధవారం పునఃప్రారంభించారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో గరగాలమ్మ డ్రెయిన్‌తో సిద్ధాంతంలో పలు ప్రాంతాలకు ముంపుకు గురవుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకురావడంతో ప్రక్షాళన పనులను ఈ నెల 10 నుంచి ప్రారంభించారు. అయితే డ్రెయిన్‌కు ఆనుకొని ఆక్రమణలు ఉండడంతో నిర్వాసితులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో కొంతమేర ప్రక్షాళన నిలిచిపోయింది. ఈ తరుణంలో పెనుగొండ తహసీల్దార్ ఎన్.గురుమూర్తి రెడ్డి, ఎస్సై ఎస్ఎస్‌వీవీ రమేష్‌లు నిర్వాసితులతో మాట్లాడి వారికి నచ్చజెప్పి ప్రక్షాళన పనులు పునః ప్రారంభింపచేశారు. ఇప్పటికే ప్రభుత్వ స్థలాలు వచ్చిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టుకోవాలని, స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చిన్నం ఏడుకొండలు, పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్‌వీవీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఫ్లెక్సీలకు అనుమతి తప్పనిసరి

పాలకోడేరు: గ్రామాల్లో ఫ్లెక్సీల ఏర్పాటుకు స్థానిక సంస్థల అనుమతి తీసుకోవాలని భీమవరం రూరల్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ అన్నారు. పెన్నాడ సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ నాగప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల తూర్పువిప్పర్రులో అంబేడ్కర్ ఫ్లెక్సీ చించివేత ఘటన నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలు ఐక్యంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో ఫ్లెక్సీల ఏర్పాటుకు గ్రామ పంచాయతీల నుంచి అనుమతి తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'కు విశేష స్పందన



పందిగుంటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సర్వే చేస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్



పాలకొల్లు మండలం పూలపల్లిలో లబ్ధిదారుల నుంచి సమాచారం సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు



శిరగాలపల్లిలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో పాల్గొన్న వల్లభు సాయి వెంకట నరసింహారావు

పాలకొల్లు అర్బన్: 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు రూరల్ పంచాయతీ పందిగుంటలో బుధవారం 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించి నవరత్నాల పథకాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు పాలకొల్లు మండలం పూలపల్లి రాజుల కాలనీలో లబ్ధిదారులను కలిసి నవరత్నాల పథకాలపై అభిప్రాయం సేకరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, పార్టీ నాయకులు విప్పర్తి ప్రభాకరరావు, పితాని రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ కడలి శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

యలమంచిలి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలంటే జగనన్నతోనే సాధ్యమని మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షులు వల్లభు సాయి వెంకట నరసింహారావు అన్నారు. మండలంలోని యలమంచిలిలంక గ్రామంలో బుధవారం జరిగిన 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక దళితపేటల్లో ఆయన పర్యటించి ప్రభుత్వం నుంచి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రతి ఇంటి వద్ద నవరత్నాల పథకాల్లో కనీసం రెండు, మూడు పథకాలు వచ్చాయని ప్రజలంతా చెప్పడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఆయన వెంట సచివాలయ కన్వీనర్ జగతాడి గంగరాజు పార్టీ నాయకులు దంపనబోయిన వెంకటరత్నం, బద్దే రాజభూషణం, పెసంగి చిరంజీవి, మురాల అమృతరావు, పెసంగి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: జగనన్న ప్రభుత్వంలోనే ప్రతీ ఒక్కరికీ లబ్ధి చేకూరిందని జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజి తెలిపారు. బుధవారం ముత్యాలపల్లి గ్రామంలో పర్యటించిన ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ కులాలు, మతాలకతీతంగా ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందించామన్నారు. జగనన్నే మా భవిష్యత్–మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో నాయకులు, గృహ సారథులు, కన్వీనర్లు మండలంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి బ్రోచర్‌లను అందించారు.

పెనుగొండలో..

పెనుగొండ: జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం బుధవారం ఆచంట, పెనుగొండ మండలాల్లో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని చెరుకువాడ, మారేమ్మగూడెం, సోమరాజు చెరువు, వెంకట్రామపురం ల్లోనూ, ఆచంట మండలంలో మధ్యస్థ లంక గ్రామాలైన అయోధ్యలంక, పుచ్చల్లంక, మర్రే మూల గ్రామాల్లోనూ ఉత్సాహంగా నిర్వహించారు.

పోడూరులో..

పోడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనంత భారీస్థాయిలో ఇంటింటా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు అన్నారు. అప్పన్నచెరువు శివారు సబ్బేవారిపేట గ్రామంలో బుధవారం 'నువ్వే మా నమ్మకం జగనన్న' కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరాజు, త గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ పర్యటించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పరిపాలనపై ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ మూర్తి, పెదపాటి శ్రీను, కుసుమె రత్నంరాజు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

'జగనన్నా నువ్వే మా దేవుడు'



యలమంచిలి: కనకాయలంక గ్రామానికి చెందిన లంకె కిషోర్ పుట్టి మూగ, చెవిటి. అతనికి దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా వికలాంగ పింఛన్ మంజూరైంది. అప్పటి నుంచి అతను రాజన్న అభిమానిగా మారాడు జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక పింఛన్ మూడు వేలకు పెరగడంతోపాటు, పిల్లలకు అమ్మ ఒడి, తల్లికి చేయూత వచ్చింది. దీంతో అతనిలో జగనన్న అంటే అభిమానం మరింత పెరిగింది. ఇటీవల 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు కిషోర్ ఇంటికి వెళ్లి నువ్వే మా నమ్మకం జగన్ స్టిక్కర్ అంటించిన వెంటనే చిత్రపటానికి నమస్కరించి అతని అభిమానాన్ని చాటుకున్నాడు.

కనకాయలంకలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ వద్ద నమస్కరిస్తున్న వికలాంగుడు లంకె కిషోర్



ముత్యాలపల్లిలో లబ్ధిదారులకు బ్రోచర్‌ను అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాపూజీ



సోమరాజు చెరువులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



సబ్బేవారిపేట గ్రామంలో 'నువ్వే మా నమ్మకం జగన్' కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

జగనన్న మళ్లీ సీఎం కావడం ఖాయం

జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పోడూరు: రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాబోయే అసెంబ్లీ ఎన్నికల అనంతరం మళ్లీ సీఎం కావడం ఖాయమని జెడ్పీ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. పెనుమదం శివారు అప్పిచెరువులో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడూరు మండలంలో పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని 8 గ్రామాల్లో ' మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం చాలా దిగ్విజయంగా జరుగుతోందంటూ గృహసారథులు,సచివాలయ కన్వీనర్లను, ఇన్‌చార్జిలను, వలంటీర్లను, పార్టీ శ్రేణులను, జేసీఎస్ కన్వీనర్ బళ్ల రాజశేఖర్‌ను, జెడ్పీ చైర్మన్ శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 8 గ్రామాల్లో దాదాపుగా 10,733 కుటుంబాలకు గాను 90 శాతం కుటుంబాలను నేరుగా కలిశారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాస్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1 కోటి 60 లక్షల కుటుంబాలను కలవడం లక్ష్యం కాగా ఇప్పటికే 97 లక్షల కుటుంబాలను కలిశారన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లిన సందర్భంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పరిపాలన పట్ల, తాము అందుకుంటున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలంతా చాలా సంతోషం వ్యక్తం చేస్తుండడంతో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు కార్యక్రమంలో మరింత ఉత్సాహంగా, చురుగ్గా పాల్గొంటున్నారన్నారు. విలేకర్ల సమావేశంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీటీడీసీ బాబు, పాలకొల్లు జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, పెనుమదం సొసైటీ చైర్మన్ కొర్రపాటి వీరాస్వామి, జేసీఎస్ కన్వీనర్ బళ్ల రాజశేఖర్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాల ప్రయోజనాలతో అభివృద్ధి పనులు



30వ వార్డులో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: నియోజకవర్గంలో దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. 30వ వార్డులో రూ 1.02 కోట్లుతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే 1వ వార్డు శ్రీహరిపేట యానాదుల కాలనీలో రూ.14 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, కల్వర్టు పనులు ప్రారంభించారు. 2వ వార్డులో వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద రూ 46 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.217 కోట్లతో స్పెషల్ ప్రాజెక్ట్ మంజూరు చేసిందని చెప్పారు. రూ.57 కోట్లతో మొదటి విడత పనులు చేపట్టనున్నామని చెప్పారు. అలాగే రూ.62 కోట్లతో మంచినీటి పైప్‌లైన్స్ ప్రక్షాళన చేయబోతున్నామని చెప్పారు. 100 పడకల ఏరియా ప్రభుత్వాసుపత్రి నిర్మాణం, శిథిలమైన బస్టాండ్‌ను రూ 5 కోట్లతో ఆధునికీకరించామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ కౌన్సిలర్లు అడిదల శ్యామల, సోమాజు దుర్గాభవానీ, నాయకులు అడిదల శరత్, గోరు సత్తిబాబు, దీపాటి జానికీరాజు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మూసరపు జయ, దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.

రూ.75 కోట్లతో రహదారుల అభివృద్ధి

నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రహదారుల అభివృద్ధికి రూ.75 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. టెండర్లు పూర్తయిన పనులు వెంటనే మొదలుపెట్టి వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి ముదునూరి తన కార్యాలయంలో ఆర్అండ్‌బీ శాఖ ముఖ్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. టెండర్లు పూర్తయ్యి పనులు ఇంకా ప్రారంభం కాని పనులపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఇంకా కొన్ని పనులు మొదలు పెట్టకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మే నెలలో పనులు చేయడానికి అనుకూలం కాబట్టి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నియోజకవర్గంలో అన్ని రహదారులు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పనులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ప్రాధాన్యత ఉన్న పనులు మొదటి పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ జేవీ భాస్కరరావు, డీఈఈ జీవీఎస్ కిరన్‌కుమార్, ఏఈ నిక్కీక్రజ్ పాల్గొన్నారు.

సకల బీసీ కులాలు ఐక్యం కావాలి



సకల బీసీ కులాల ఆత్మీయ సమావేశంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: సకల బీసీ కులాలు ఐక్యంగా ఉంటూ రాజకీయంగా ముందుకు సాగాలని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. దళిత, బహుజనులు అత్యధికంగా ఉన్న పాలకొల్లు అసెంబ్లీ సీటును వైసీపీ గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పాలకొల్లు అడబాల గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన సకల బీసీ కులాల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా మహాత్మా జ్యోతీరావ్ పూలే చిత్రపటానికి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలకొల్లులో పల్లె నిద్ర చేయనున్నారని వెల్లడించారు. ఆ సమయానికి నియోజకవర్గంలోని అన్ని బీసీ కులాలతో భారీ బహిరంగ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. జెడ్పీ చైర్మన్‌గా నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని వివరించారు. శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యానారాయణ, సర్పంచ్‌లు కెల్లా సింహాచలం, పొలిమేర వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ చింతపల్లి సాయిబాబా, బీసీ కులాల నాయకులు ముద్దాడ గణేష్ భవాని, చినిమిల్లి గణపతిరావు, కోరాడ శ్రీనివాసరావు, లోపింటి చిరంజీవి, అప్పారి నాగరాజు, బొక్కా సురేష్, పితాని చిన్న, గుబ్బల సత్యనారాయణ, అల్లు మురళి, జోగి వెంకటేశ్వరరావు, కుక్కల బాలచంద్రుడు, నీలంశెట్టి సత్యప్రసాద్, ఇజ్జాడ చినబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వరికోతల సందడి



వెంకట్రామపురంలో యంత్రంతో వరికోస్తున్న దృశ్యం



తేమ శాతం తగ్గించుకోవడానికి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

50 నుంచి 60 బస్తాల దిగుబడి

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో వరికోతలు మొదలయ్యాయి. సీజన్ ప్రారంభం నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో రైతులు ఉత్సాహంగా కోతలు ప్రారంభించారు. ఇప్పటికే కోతలు పూర్తయిన ప్రాంతాల్లో అత్యధిక దిగుబడులు నమోదు కావడంతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది. వరికోతల కోసం ఎక్కువగా యంత్రాలను వినియోగిస్తున్నారు. పశుగ్రాసం కావాల్సిన వారు, విత్తనాలు సాగు చేసిన రైతులు మాత్రం సాంప్రదాయ పద్ధతిలో వరి కోస్తున్నారు. దీనికి కూడా కూలీలను స్థానికంగా కాకుండా బెంగాలీలపైనే ఆధారపడుతున్నారు. నియోజకవర్గంలో ఆచంట మండలంలో 4500 హెక్టార్లు, పెనుగొండ మండలంలో 5047 హెక్టార్లు, పెనుమంట్ర మండలంలో 5446 హెక్టార్లు, పోడూరు మండలంలోని 8 గ్రామాల్లో 2968 హెక్టార్లలోనూ వరి సాగు చేస్తున్నారు.

పెరిగిన దిగుబడులు

దిగుబడులు అంచనాల మించి నమోదు అవుతున్నాయి. వెంకట్రామపురం, వడలి, చిన్నంవారి పాలెంల్లో ఇప్పటికే కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో 60 బస్తాల వరకూ నమోదవుతున్నాయి. అయితే ప్రభుత్వం ఏర్పాటు కొనుగోలు కేంద్రాల వద్ద 100 సారలకు మాత్రమే అనుమతి ఉందని, ఎకరానికి 120 సారల వరకూ పరిమితిని పెంచాలంటూ రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎంటీయూ 1121దే ప్రథమ స్థానం

దాళ్వా సాగులో రైతులు ఎంటీయూ 1121 రకం వైపే మొగ్గు చూపడంతో సాగులో అత్యధికం భాగం పొందింది. వీటి తరువాత సార్వా సాగుకోసం రైతులు స్వర్ణ, ఎంటీయూ 1064, ఎంటీయూ 1318, సంపద వంటి రకాలను సాగు చేశారు.

పరిమితి పెంచాలి



ధాన్యం అమ్మకానికి పరిమితులు పెంచాలి. ఎకరానికి 100 సారల పరిమితి ఉండడంతో మిగిలిన ధాన్యం అమ్ముకోవడం ఇబ్బందికరంగా మారుతుంది. అధికారులు పునః సమీక్ష నిర్వహించి పరిమితిని 120 సారలకు పెంచాలి

– విప్పర్తి రాంబాబు, రైతు, వడలి

వాతావరణం అనుకూలించింది



నీటి ఎద్దడి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సాగు సాగింది. ప్రభుత్వ చర్యలకు తోడుగా, వాతావరణం సైతం అనుకూలించడంతో దిగుబడులు సైతం పెరిగాయి.

– చిన్నం వెంకటరెడ్డి,రైతు, చిన్నంవారిపాలెం

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

సాక్షి, భీమవరం: పట్టణంలో బుధవారం ఆసుపత్రుల వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్య ప్రకాశరావు ఆధ్వర్యంలో అగ్నిమాపక వాహనాలతో ర్యాలీ నిర్వహించారు.

28 నుంచి కొంతేరులో నాటికల పోటీలు



నాటికల పోటీల బ్రోచర్ విడుదల చేస్తున్న యూత్‌క్లబ్ పాలకవర్గ సభ్యులు

యలమంచిలి: యూత్ క్లబ్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు కొంతేరు పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిరంలో 41వ రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ చైర్మన్ అంబటి మురళీకృష్ణ, పాలకవర్గ సభ్యులు తెలిపారు. స్థానిక కళామందిరంలో బుధవారం సమావేశమైన సభ్యులు నాటిక పోటీల బ్రోచర్ విడుదల చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గంటా ముత్యాలరావు (నాయుడు), ఉపాధ్యక్షులు బోణం రవిబాబు, జక్కంశెట్టి సుబ్రహ్మణ్యం కోశాధికారి అంబటి నవీన్‌చంద్, సహాయ కార్యదర్శులు బోడపాటి రాజశేకర్, సుదర్శనం శ్రీనివాస్ సమన్వయకర్తలు జవ్వాది శ్రీనివాసులనాయుడు, గోడి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి జోగి రమేష్ పర్యటన

ఆకివీడు: మండలంలోని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ గురువారం పర్యటించనున్నారు. పలు రోడ్లకు శంకుస్థాపన, సచివాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు కృషితో రొయ్య రైతుల సంఘం జాతీయ అధ్యక్షుడు ఇందుకూరి మోహనరావు చొరవతో కేంద్ర రహదారుల నిధులు (సీఆర్ఎఫ్) మంజూరయ్యాయి. ఈ నిధులు రూ.25 కోట్లతో భీమవరం – కొల్లేరు రహదారిలో పాములపర్రు – పెదకాపవరం – గంటలరాయుడుపేట వంతెన వరకు ఆరున్నర కిలో మీటర్ల రహదారి, 2,900 మీటర్ల రిటర్నింగ్ వాల్ నిర్మించనున్నారు. కలవపూడి – గణపవరం (కేజీ రహదారి) రహదారిలో చినకాపవరం నుంచి క్రొవ్విడి వరకు మూడు కిలో మీటర్లు, ఏలూరుపాడు వంతెన వద్ద నుంచి చెరుకుమిల్లి శివారు వరకు 3.8 కిలో మీటర్ల రహదారి, 1,900 మీటర్ల రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి మంత్రి రమేష్ శంకుస్థాపన చేయనున్నారు.